# అపొల్లోలో ఉన్న శ్రేష్ఠమైన లక్షణాలు

## అపొల్లోను గూర్చిన పాఠ్య భాగములు

అపొస్తలుల కార్యములు 18:24 - 28, 19:1; 1 కొరింథీయులకు 1:12; 3:4 - 6,22; 4:1-2; 16:12; తీతు 3:13

## అపొల్లో ఎవరు?

అపొల్లో విద్యావంతుడు. ఐగుప్తులోని అలెగ్జాండ్రియా (తెలుగు బైబిలులో అలెక్సంద్రియపట్టణస్థుడు అని ఉంది) నివాసి. ఇతడు యూదుడు. (ఐగుప్తు = ఈజిప్టు ఒకటే). ఆనాడు ఐగుప్తులో పదివేలవరకు గ్రీకు భాష మాట్లాడే యూదులుండేవారు. రోమా సామ్రాజ్యమంతటికి రోమ్ నగరం పెద్దది. రెండవ నగరం ఆలెగ్జాండ్రియా. అలెగ్జాండర్ ది గ్రేట్' ఈ పట్టణ స్థాపకుడు. ఇక్కడ చాలా పెద్ద సమాజమందిరము (సునగోగు) ఉండేది. ఇక్కడే యూదు విద్యార్థులందరికి కూలంకుషంగా విద్యాబోధన జరిగేది.

అపొల్లో పూర్తి పేరు అపొల్లోనియస్. అపొల్లో అనగా నాశకుడు అని అర్థం. గ్రీకు పురాణం ప్రకారము అపొల్లు గ్రీకుల సూర్యదేవుడైయున్నాడు. మొదటి శతాబ్దంలోని వాడు, పౌలు సమకాలికుడు, ఎఫెసు, కొరింథీ పట్టణాలలో సంఘాల అభివృద్ధికి బహుగా కృషి చేసినవాడు. ఇతడు బహు విద్యావంతుడు (Educated / Learned).

## అపొల్లో సాధించిన విజయాలు

## 1. అపొల్లో గొప్ప బోధకుడు, నిపుణుడు

"అలెక్సంద్రియవాడైన అపొల్లో అను ఒక యూదుడుఎఫెసునకు వచ్చెను. అతడు విద్వాంసుడును లేఖనములయందు ప్రవీణుడైయుండెను" (అపొస్తలుల కార్యములు 18:24). అపొల్లో లేఖనాలలో ప్రవీణుడు అని లూకా రాశాడు. ముఖ్యంగా పాత నిబంధన లేఖనాలలో ఇతడు నిపుణుడు. లేఖనాలలో ఆరితేరినవాడు. ఎజ్రా కూడా ప్రవీణతగల శాస్త్రి (ఎజ్రా 7:6) అని చదువుతాం. తిమోతి కూడా లేఖనములను ఎరిగిన వాడు (2 తిమోతి 3:14). ఇతరులు ఎవరికి లేని వరం (an outstanding gift) గలవాడు. బహుశా పౌలుకి కూడా లేనంత గొప్ప వాక్చాతుర్యం, ప్రసంగించే వాక్శక్తి (Oratory) గలవాడై యుండొచ్చు. ఆయన వాక్యఝరి / వాగ్ధాటి (Elo-quence) కి శ్రోతలు ఆశ్చర్యపడేవారని తెలుస్తుంది.

### బైబిల్లో కొందరు ప్రవీణులు

1. అపొల్లో లేఖనముల యందు ప్రవీణుడు - అపొస్తలుల కార్యములు 18:24

2. ఎజ్రా ధర్మశాస్త్రము నందు ప్రవీణుడు ఎజ్రా 7:6

3. మోషే మాటలయందును కార్యములయందును ప్రవీణుడు అపొస్తలుల కార్యములు 7:22

4. దావీదు యుద్ధమునందు ప్రవీణుడు 2 సమూయేలు 17:8

5. ఊలాము కుమారులు విలువిద్యయందు ప్రవీణులు - 1 దినవృత్తాంతములు 8:40

6. 288 మంది గానము చేయుటలో నేర్పు పొందిన ప్రవీణులు - 1 దినవృత్తాంతములు 25:7

పౌలు గురించి కొరింథీయులు యిలా అన్నారు. అతని పత్రికలు ఘనమైనవియు, బలీయమైనవియునై యున్నవి, గాని అతడు శరీర రూపమునకు బలహీనుడు, అతని ప్రసంగము కొరగానిదని యొకడు అనును.

(2 కొరింథీయులకు 10:10).

దీన్నిబట్టి చూస్తే పౌలుకు వాక్చాతుర్యం, వాగ్ధాటి లేవని కొందరు అనుకున్నట్టుగా ఉంది. అంటే సత్యాన్ని అందించడంలో అతడు మరీ మెతకగా, సున్నితంగా, సాత్వికంగా ప్రవర్తిస్తాడని కూడా అనుకుంటారు. గాని అతని ఉత్తరాలు మాత్రం గంభీరమైనవి, తీవ్రమైనవి అని నిజం ఒప్పుకుంటున్నారు.

అపొల్లో ఎక్కడ ప్రసంగించినా ప్రజలు ఆయన మాటలు వినడానికి గుంపులు గుంపులుగా కూడుకుంటారని ప్రతీతి. నేటి యౌవనస్థులు కూడా కష్టపడి లేఖనాలు పరిశీలించి గొప్ప ప్రసంగీకులు కావాలని నా ఆశ, నా ప్రార్థన. దేవుని ఎదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము (2 తిమోతి 2:15).

## 2. అపొల్లో నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి

"ప్రిస్కిల్ల అకులయు విని అతని చేర్చుకొని దేవుని మార్గము మరి పూర్తిగా అతనికి విశదపరచిరి (అపొస్తలుల కార్యములు 18:26). అపొల్లో శిష్యునికి తగిన మనస్సు గలవాడు. అతడు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు గమనిస్తాము. అపొల్లో మాట్లాడుతున్న సమాజ మందిరంలోఅనగా ఆరాధించేవారిలో అకుల, ప్రిస్కిల్లలు (భార్యభర్తలు) ఉన్నారు. అపొల్లో బోధ వినగానే అందులోని లోపం వారికి అర్థమై పోయింది. అతనిని తమ యింటికి ఆహ్వానించి, అతడు

తెలుసుకోవలసిన అదనపుసమాచారాన్ని అతనికి అందించారు. వారి దగ్గర ఇంకా కొన్ని సత్యాలు నేర్చుకొనేందుకు వినయం, విధేయత, చూపించాడు. నేనేంటి? డేరాలు కుట్టుకునేవాడు, అతని భార్య (ఒక స్త్రీ) దగ్గర నేను నేర్చుకోవడం ఏమిటి? అని నామోషి పడలేదు.అకుల- ప్రిస్కిల్లలు పౌలు దగ్గర సువార్త సత్యం, వాక్య సత్యం బాగా నేర్చుకున్నారు. వెంటనే అతనిలోని పొరబాటును యిట్టే గుర్తించారు. ఓ రకంగా ఆ సమాజ మందిరంలో అపొల్లోకి ఉపదేశం చెప్పడానికి అనుమతి ఇవ్వడం ద్వారా సంఘానికి విలువైన సేవ చేశారు. ప్రాముఖ్యంగా అపొల్లోకి ఎంతో మేలు జరిగింది. అపొల్లో నేర్చుకోడానికి వెనుకాడలేదు గనుక, ఆ తరువాత అతడు యింకా మంచి బోధకుడయ్యాడు.

ఈ రోజున యిలాంటి అపొల్లోలు మన సంఘాల్లో ఉన్నారా? లేరనే చెప్పాలి. నాలుగు పాటలు, నాలుగు ప్రసంగాలు వస్తే చాలు! మరికొంతమందికి పిలుపు లేకపోయినా, బంధువులు, స్నేహితులు దగ్గరకు ఇతర దేశాలు వెళ్ళడం, పేరు ప్రక్కన అంతర్జాతీయ ప్రసంగీకులు, గాయకులు, కళాకారులు అని వేయించుకోవడం అతిసామాన్యమైపోయింది. నేర్చుకోవాలని లేదు.

ప్రియులారా! దేవుని చేతిలో మనం బలమైన సాధనాలుగా ఉండాలంటే ఆయన నేర్చుకోమన్న రీతిలో నేర్చుకోవలసిందే. ముఖ్యముగా ఆయన కాడి ఎత్తుకొని, ఆయన్నే నేర్చుకోవాలి (మత్తయి 11:29). అపొల్లో బాగా మాట్లాడతాడు గాని అతనికి యోహాను బాప్తీస్మము మాత్రమే తెలుసు. యేసు జన్మ, పరిచర్య, మరణ పునరుత్థానాలు అపొల్లో ఎరిగినప్పటికిని పరిశుద్ధాత్ముని పరిచర్య గురించి అపొల్లోకు తెలియదు. (అపొస్తలుల కార్యములు 19:1-10 చదవండి).

## 3. అపొల్లో ఆత్మయందు తీవ్రత గలవాడు

అతడు ప్రభువు మార్గము విషయమై ఉపదేశము పొంది తన ఆత్మయందు తీవ్రపడి, యోహాను బాప్తీస్మము మాత్రమే తెలుసుకొనినవాడైననుయేసును గూర్చిన సంగతులు వివరముగా చెప్పి బోధించుచు సమాజ మందిరములో ధైర్యముగా మాటలాడ నారంభించెను (అపొస్తలుల కార్యములు 18:25).

అపొల్లో శ్రద్ధాసక్తుల విషయంలో వెనుకపడకుండా ఆత్మలో తీవ్రత కలిగి ప్రభుని సేవ చేస్తున్నాడు. ఎప్పుడైనాసరే దేవుణ్ణి ప్రేమించవలసినంతగా ప్రేమిస్తే ఆత్మలోమంట ఉంటుంది. ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఆయన సేవను గూర్చిన ఆసక్తి భక్షిస్తుంది.అపొల్లో అత్యాసక్తిపరుడై ప్రభువైన యేసును గూర్చిన సంగతులు ఉన్నవి ఉన్నట్టు చెబుతున్నాడు.

"హృదయము నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా! (మత్తయి 12:34). దేవుడు కేవలం ఔత్సాహికులను ఇష్టపడతాడు. ఒక ఫుట్బాల్ టీములో గాని, క్రికెట్ టీములో గాని ఔత్సాహికులు ఉంటే, ఆట చూస్తున్న వారి ఆనందం, సంగీతం, వ్యాఖ్యానం చాలా వేడిగా ఉంటుంది. ఉష్ణోగ్రత విపరీతముగా పెరిగిపోతాది. ఆ ప్రాంగణమంతా కొలిమి సెగలు కక్కినట్లుంది. మనసంఘాలలో పెద్దలు, పరిచారకులు, యౌవన ప్రసంగీకులు అపొల్లోలుగా మారాలి. పరిశుద్ధతను గూర్చిన మంట ప్రార్థనను గూర్చిన మంట, వాక్యం నేర్చుకోవాలనే మంట తీవ్రత కలిగియుండేది ఎన్నడో? మనమంతా ఈ ఉత్సాహస్థాయికి, తీవ్రతకు రావాలి. ఎప్పుడైనాసరే దేవుణ్ణి ప్రేమించవలసినంతగా ప్రేమిస్తే ఆత్మలో మంట ఉంటుంది. ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఆయన సేవను గూర్చిన ఆసక్తి భక్షిస్తుంది.

## 4. అపొల్లో ప్రభువు మార్గము విషయమై ఉపదేశము పొందినవాడు

"అతడు ప్రభువు మార్గము విషయమై ఉపదేశము పొందినవాడు. అపొస్తలుల కార్యములు 18:25. ఇతర వ్రాతప్రతులు కొన్నింటిలో అతడు ప్రభువు మార్గము విషయమందు తన స్వదేశమందే ఉపదేశము పొందాడని రాసి ఉంది. ఆలాగైతే క్రీస్తు శకం 33 నాటికే క్రైస్తవ సువార్త ఈజిప్టులోప్రవేశించిందని చెప్పవచ్చు. క్రీస్తును గూర్చి అతనికి ఉపదేశించినవారు యోహాను అనుచరులు కావచ్చు. లేక యోహానే కావచ్చు. యోహాను ద్వారా బాప్తిస్మం పొంది అతడిని, అతని బోధలను, అతని శిష్యుల్ని హత్తుకున్నాడు.నేడు మనం ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ఉపదేశాలు పొందుతున్నామా?

ఒక్కోసారి ప్రభువు నేరుగా మనకే ఉపదేశిస్తాడు. మరి కొన్నిసార్లు ఆయన నమ్మకమైనవారినిగా ఎంచుకున్న వారి ద్వారా కూడా మనకు తెలియజేస్తాడు. పౌలు విషయంలో అననీయ ఈ పనికి నియమించబడ్డాడు (అపొస్తలుల కార్యములు 9:10,17). తిమోతి విషయంలో పౌలు ఒకటి చెయ్యొద్దు అన్నాడు. నీకు అనుగ్రహింపబడి నీలోనున్న వరమును "అలక్ష్యము చేయకుము" అన్నాడు (1 తిమోతి 4:14). మరొకటి చేయమన్నాడు... శ్రమపడుము సువార్తికుని పనిచేయుము (2తిమోతి 4:5) అన్నాడు. ఈ విధంగా ప్రభువు మార్గము విషయమై ఉపదేశం పొందాలి. ఎప్పుడైతే యిలా ఉపదేశం పొందుతామో ఆ పరిచర్య, సౌవార్తీకరణ, అందరికీ ఆమోద యోగ్యంగా కొనసాగించబడుతుంది. అది ప్రభువుదగ్గరనుంచి వచ్చిందేనా అనే స్థిరమైన నిర్ధారణ జరగాలి.

"నీకు ఉపదేశము చేసెదను నీవు నడవవలసిన మార్గమును నీకు బోధించెదను నీమీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పెదను (కీర్తనలు 32:8). దేవుని ఉపదేశం ఆలకించి, ఆయన సమయోచితమైన సలహాల కొరకు ఎదురు చూస్తూ, దైవ క్రమశిక్షణలో నడిస్తే మన జీవితంలో మిగిలిన కాలమంతా జ్ఞానవంతులం అవుతాం. ఆయన ఉపదేశం కొరకు, ఆయన సమయం కొరకు ప్రార్థనలో కనిపెట్టాలి. బైబిల్ ధ్యానించకుండా ఎన్నడూ ఆయన ఉపదేశాన్ని పొందలేము. ఆయన ఉపదేశం కొరకు కనిపెడుతున్నప్పుడు కొన్ని సవాళ్ళు ఎదురౌవుతాయి ప్రజలు మన మాటలు వినక ముందు మన నడవడిని గమనిస్తారు.

## 5. అపొల్లో సంచార బోధకుడు

"సహోదరుడైన అపొల్లోను గూర్చిన సంగతిఏమనగా, అతడీ సహోదరులతో కూడ మీ యొద్దకు వెళ్ళవలెనని నేనతని చాలా బతిమాలుకొంటిని గాని, యిప్పుడు వచ్చుటకు అతనికి ఎంతమాత్రమును మనస్సులేదు, వీలైనప్పుడతడు వచ్చును" (1 కొరింథీయులకు 16:12). అపొల్లో, ఎఫెసు, కొరింథీ, అకయ మరికొన్ని ప్రాంతాలు తిరుగుతున్నాడు. ఈ విధంగా సంచార అపొల్లో సంచార సువార్తికుడుగా కన్పిస్తున్నాడు. అపొస్తులుడైన పౌలు చివరిసారిగా తీతుకు రాసిన లేఖలో అపొల్లో గురించి యిలా ప్రస్తావించాడు ధర్మశాస్త్రవేదియైన జేనాను (న్యాయవాది జేనస్ - Zenas is the Law-yer), అపొల్లోనును శీఘ్రముగా సాగనంపుము. వారికేమియు తక్కువ లేకుండా చూడుము (తీతుకు 3:13). అపొల్లోకు తీతు (టైటస్) సహాయం అవసరమయ్యింది. అంతేకాక ఎఫెసు సంఘానికి, కొరింథీ సంఘానికి రాకపోకలు, చక్కని అనుబంధం ఉన్నట్టు తెలుస్తుంది (1 కొరింథీయులకు 16:19).

వారు బయలుదేరి అంతటను సువార్త ప్రకటించుచు (రోగులను) స్వస్థపరచుచు గ్రామములలో సంచారము చేసిరి (లూకా 9:6). యేసుప్రభువువారిశిష్యులు సేవా విధానమిది. ఇదే విధానాన్ని పేతురు కొనసాగించాడు (అపొస్తలుల కార్యములు 9:32), చెదరిపోయిన శిష్యులు (అపొస్తలుల కార్యములు 8:4). పౌలు, సీలలు (అపొస్తలుల కార్యములు 15:41, 1 కొరింథీయులకు 16:5) కొనసాగించారు. అపొల్లో కూడా కొనసాగించాడు. యేసుప్రభువు వారి శుభవార్తను ఇతరులతో మాట్లాడడానికి మనం మార్గాలు వెతుక్కోవాలి. అపరిచయస్థులతో మాట్లాడడానికి అందరు యిష్టపడరు. అందరికి ఒకే పద్ధతి సరిపడకపోవచ్చు కూడా. అయినా ప్రయత్నం చేయాలి. ఈ ప్రమాదకరమైన దినాలలో సంచార సేవ అనేది చాలా కష్టమైంది. ప్రజలు మన మాటలు వినక ముందు మన నడవడిని గమనిస్తారు. సువార్త వినేవారిలో మార్పు తెచ్చే మంచి నడవడి మనలో కావాలి. దేవుని అపరిమితమైన కృపకొరకు ప్రార్థించాలి. "తరువాత అతడు అకయకు పోదలచినప్పుడు అతనిని చేర్చుకొనవలెనని సహోదరులు ప్రోత్సాహపరుచుచు అక్కడి శిష్యులకు వ్రాసిరి (అపొస్తలుల కార్యములు 18:27). దీన్ని సిఫారసు పత్రిక (Commendation Letter) అంటారు. క్రొత్త స్థలానికి వెళ్ళేటప్పుడు సిఫారసు పత్రిక ఉండడం ఎంతో సహాయకరం. అనతికాలంలోనే కొరింథీ క్రైస్తవులందరి తరఫున వాదించే దిట్టమైన వక్త అయ్యాడు అపొల్లో.కొన్నిసార్లు సామర్థ్యంతో మంచిగా బోధించడం కూడా సమస్యలకు దారితీస్తుంది. అదే కొరింథీలో జరిగింది. ప్రకటించిన సందేశం అనుసరించడం మాని, అపొల్లోను అనుసరించడం మొదలుపెట్టారు.

ప్రస్తుత దినాల్లో కూడా (క్రైస్తవ సంఘం) క్రైస్తవ లోకం ఎదుర్కొంటున్న గొప్ప సమస్య ఇదే. ఎవరికి నచ్చిన బోధకుల పేరున చిన్న చిన్న అభిమాన సంఘాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా చీలిపోవడాన్ని పౌలు తీవ్రంగా మందలించాడు. వ్యక్తులపై, వస్తువులపై, విషయంపై విధానంపై అభిమానం ఉండడం సహజమే. తల్లిదండ్రుల మీద, గురువుల మీద, స్నేహితుల మీద, అనుభవజ్ఞులైన నాయకుల మీద అభిమానం ఉంటుంది. మంచిదే గాని విభజనలు, చీలికలు మంచిది కాదు. ఉన్న సంఘమే ముక్కముక్కలైతే విచారం. విభేదాలు కలిగించి, విభజనలు కలిగించేవాళ్ళ గురించి చాలా అప్రమత్తంగా ఉండాలి. క్రీస్తు విభజింపబడి ఉన్నాడా 1కోరి1:13 గొప్ప ఆలోచన పౌలు, కేఫా, అపొల్లో అనే ఈ నాయకుల పేరట కొరింథీలో విభజనలు కలుగకుండా వారు జాగ్రత్త వహించారు. ఈ పరిస్థితి రావడానికి అపొల్లో కారణం కాదు. కొరింథీయులే కారణం. వారు శరీర సంబంధులు (1 కొరింథీయులకు 3:4-6). విభేదాలు కలిగించి, విభజనలు కలిగించేవాళ్ళ గురించి చాలా అప్రమత్తంగా ఉండాలి.

## 6. అపొల్లో యూదుడైయుండి యూదులకు వ్యతిరేకంగా మాట్లాడినవాడు.

“యేసే క్రీస్తు" అని లేఖనముల ద్వారా అతడు దృష్టాంతపరచి, యూదుల వాదమును బహిరంగముగాను గట్టిగాను ఖండించుచు వచ్చెను (అపొస్తలుల కార్యములు 18:28). యూదుడై యుండి యూదుల వాదనను గట్టిగా ఖండించుచుండెను అని రాయబడింది.

## ఏ విషయంలో ఖండించాడు?

యూదులు యేసు ప్రభువును అంగీకరించిన వారుకాదు. "యూదులు ఆయనను కొట్టవలెనని మరల రాళ్ళు చేత పట్టుకొనగా" (యోహాను 10:31). మరల అంటే అంతకు ముందూ రాళ్ళు ఎత్తుతూనే ఉన్నారని అర్థం.

## అసలు వాళ్ళ వాదన ఏంటి?

అందుకు యూదులు - నీవు మనుష్యుడవైయుండి, దేవుడనని చెప్పుకొనుచున్నావు గనుక దేవదూషణ చేసినందుకే నిన్ను రాళ్ళతో కొట్టుదుము గాని మంచి క్రియ చేసినందుకు కాదని ఆయనతో చెప్పిరి (యోహాను 10:33). యేసు ప్రభువు వారు కూడ తమలాంటి మామూలు మనిషేనని వారు బావించారు. గనుక దేవాలయంలోనే (చర్చిలోనే) ఆయన మీద విసరడానికి రాళ్ళు తీసుకున్నారు. ఆయన ఎటువంటి గొప్ప కార్యాలు చేసాడో ప్రభువు గుర్తుచేస్తున్నా అవి వారికి పట్టలేదు. యేసు దేవుడని యూదులు బొత్తిగా నమ్మలేదు. మొద్దుబారిపోయిన ఆ ప్రజలు ఆయన్ని నిరాకరించి ఆయన మానవమాత్రుడే అంటున్నారు. యేసు మానవ మాత్రుడు అనుకోవడంలో యూదులు ఘోరమైన పొరబాటులో ఉన్నారు.అటువంటి పరిస్థితిలో యూదుడై యుండియూదుల్ని ఎదిరించిన వాడు అపొల్లో. యోహాను 9:22 లో గుడ్డివాని తల్లిదండ్రులు యూదులకు భయపడి వీడు మాకొడుకే గుడ్డివాడు గానే పుట్టాడు. గానీ ఇప్పుడు ఎలా చూడగలుగుతున్నాడో మాకు తెలిదు.అతడి కళ్ళు తెరిచింది ఎవరో అది కూడా తెలిదు. అతడు వయస్సు వచ్చినవాడు. అతన్నే అడగండి అన్నారు.

దీని వెనకాల మతలబు ఏమిటీ?

ఆయన క్రీస్తు అని ఎవరైనా ఒప్పుకుంటే హింసిస్తారు. అన్యాయంగా ఒత్తిడి తెస్తారు. భయపెడతారు. బెదిరింపులకు గురిచేస్తారు. సమాజ మందిరములో నుండి వెలివేస్తారు. ఇవన్నీ ముందే నిర్ణయం అయిపోయాయి. ఇలాంటి వాటిని అధిగమించి ప్రభువు పక్షం నిలబడ్డాడు అపొల్లో. ఆయన నమ్మిన సందేశాన్ని భయం లేకుండా, పక్షపాతం లేకుండా బోధించడం గొప్పసంగతి. నేటి బోధకులకు, విశ్వాసులకు అపొల్లో జీవితం మాదిరికరమైనది. ఈ రోజుల్లో కూడ చాలామంది ఆయన గొప్పదనాన్ని ఎరుగుదురు. ఆయన్ని శ్లాఘిస్తారు, కీర్తిస్తారు గానీ ఆయన ఒక్కడే నిజమైన దేవుడని ఎరుగని వారు కులానికి, లోకానికి, మతానికి భయపడి ఆయన్ని నమ్మడం లేదు. ఆయన్ని ప్రభువుగా రక్షకునిగా అంగీకరిస్తే మనం జీవించగలమా? అని కొందరి ఆలోచన. యింతమంది బంధువుల్ని, బలగాన్ని ఎలా వదులుకోవాలి? అనే ప్రశ్న. బైబిల్ ఏం చెబుతుంది? "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును (మత్తయి 10:32).పరిస్థితులను ఎదిరించి నిలదొక్కుకున్న అపొల్లో ప్రశంసనీయుడు. అపొల్లోలో ఉన్న శ్రేష్ఠమైన లక్షణాలు మనము కూడా కలిగియుండడానికి ప్రయాసపడదాం.